క్లుప్తంగా

ప్రత్యేక అవసరాలున్న చిన్నారులకు ఇంటి వద్దనే విద్య



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఇంటి వద్దనే విద్యను అందిస్తామని ఫిజియోథెరపిస్ట్ అరుణ్ తెలిపారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల ఇంటికి వెళ్లి వారికి విద్యను అందించారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలి



ఎల్లారెడ్డి: ఎన్నికల విధులను నిర్వర్తించే సిబ్బంది వారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో ఏపీవోలకు ఎన్నికల విధులకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు మాందాపూర్ విద్యార్థులు



బీబీపేట: రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు మండలంలోని మాందాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన సి.సాయికృష్ణ, సీహెచ్. శ్రీనిధిలు, ఆవరణ వ్యవస్థ–వలస పక్షుల ప్రభావంపై రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు సారయ్య తెలిపారు. కామారెడ్డిలో ప్రదర్శించిన ఈ ప్రదర్శనలు రాష్ట్ర స్థాయికి ఎంపికవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మానించారు.

ఆర్థిక చేయూత



రాజంపేట: మండలం కేంద్రానికి చెందిన చాకలి సాయిలు అనారోగ్యం కారణంగా శుక్రవారం చనిపోయాడు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు శనివారం బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. సాయిలు ఇలా అకస్మాత్తుగా చనిపోవడం బాధాకరమన్నారు. మండల అధ్యక్షులు యాదవరెడ్డి, సీనియర్ నాయకులు వీరన్నపటేల్, కిసాన్ సెల్ అధ్యక్షులు జూకంటి సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి వైస్ ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల అకాడమిక్ సమన్వయకర్త వి.శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కుప్రియాల్‌వాసుల భజన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్ గ్రామానికి చెందిన సత్యానంద భజన మండలి సభ్యులు తిరుపతిలో శనివారం భజన కీర్తనలు ఆలపించారు. అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో భాగంగా భజన కీర్తనలు ఆలపించినట్లు వారు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. భజన మండలి ప్రతినిధులు రాజిరెడ్డి, వడ్ల మల్లేశం ఉన్నారు.

ఆలయంలో భక్తుల సందడి

మద్నూర్(జుక్కల్): సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం శనివారం కార్తీక మాసం సందర్భంగా భక్తులతో సందడిగా మారింది. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ్, అరవింద్ మహారాజ్ ఆలయంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లకి సేవ చేశారు. భక్తులు, వార్కారీలు ఆలయంలో భజన, కీర్తన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతిపక్షాలకు అభ్యర్థులు కరువు

- ఇతర జిల్లాల నుంచి తెప్పించి జుక్కల్‌లో పోటీ చేయిస్తున్నారు
- జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



పార్టీలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలు



పోతురెడ్డిపల్లితండాకు వచ్చిన ఎమ్మెల్యే సింధేకు హారతులతో స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

పిట్లం(జుక్కల్): ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులు దొరకడం లేదని, ఇతర జిల్లాల నుంచి అభ్యర్థులను తెప్పించి జుక్కల్ నియోజకవర్గంలో పోటీ చేయిస్తున్నారని, నేను పక్కా లోకల్.. ఇక్కడే పుట్టిన ఇక్కడే పెరిగిన.. రేపు నేనే చనిపోయిన నా చితిని కూడ ఇక్కడే పెడతారని జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఆయన శనివారం జగదాంబతండా గ్రామ పంచాయతీ పరధిలోని తండాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింధేకు ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా సింధే మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని అన్నారు. పల్లెలు, తండాలు అభివృద్ధి చెందాలనే బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెలను, తాండలను గ్రామపంచాయతీలుగా చేసిందని గుర్తు చేశారు. రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించడానికి నాగమడుగు ఎత్తిపోతుల పథకం ప్రారంభించామని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు గత ప్రభుత్వాలు చేయని అభివృద్ధి పనులను చాలా చేశానని, ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే మిగితా పనులు పూర్తి చేస్తానని చెప్పారు. బీఆర్ఎస్ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, మండల రైతు సమితి అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు.

అభివృద్ధి పనులకు పట్టం కట్టాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ



నిజాంసాగర్(జుక్కల్): సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దఫేదార్ శోభ అన్నారు. శనివారం మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధేకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి హన్మంత్ సింధేను గెలిపించాలని కోరారు. జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, నాయకులు వాజిద్ అలీ, రాంచందర్, తదితరులున్నారు.

ప్రజాసేవ చేశాను.. ఒక్కసారి ఆశీర్వదించండి



దగ్గిలో మాట్లాడుతున్న వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి



సుభాష్‌రెడ్డి సమక్షంలో చేరుతున్న యువకులు

- ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీలో ఉంటూ స్వచ్ఛందంగా ప్రజాసేవ చేశానని ఒక్కసారి ఆశీర్వదించి బీజేపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం దగ్గి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి వాడుకుని కరివేపాకు మాదిరిగా టికెట్టు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు బీఆర్ఎస్ మంత్రి బంధువని ఆయనను గెలిపిస్తే సురేందర్ మాదిరిగా బీఆర్ఎస్‌కు అమ్ముడుపోతారన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీజేపీలో చేరిన రుద్రారం యువకులు

ఎల్లారెడ్డి: రుద్రారం గ్రామానికి చెందిన యువకులు శనివారం బీజేపీలో చేరారు. వీరికి సుభాష్‌రెడ్డి, బీజేపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బూత్ కమిటీ సభ్యులకు మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి సూచించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజవర్గ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పట్టణ ఇంచార్జి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా



గాంధారిలో ప్రచారం చేస్తున్న జాజాల సురేందర్



బ్రాహ్మణపల్లిలో .. బీఆర్ఎస్ నేతలు

- ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్

గాంధారి(ఎల్లారెడ్డి): మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ అన్నారు. శనివారం ఆయన రాంలక్ష్మణ్‌పల్లి, మాతు సంగెం, పేట్‌సంగెం, రాంపూర్‌గడ్డ, పెద్ద పోతంగల్, చిన్న పోతంగల్, తిమ్మాపూర్, మాధవ్‌పల్లి, గుడిమెట్ తదితర గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. మాతు సంగెంలో బోనాలతో స్వాగతం పలికారు. అన్ని గ్రామాల్లో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చానన్నారు. అధికారంలోకి రాగానే అమలు చేయబోయే పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్ని సమస్యలు పరిష్కరించినా కొత్త సమస్యలు వస్తుంటాయని కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ వారి సహకారంతో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. ఈ కార్యక్రమంలో 22 రకాల ఎగ్జిబిట్స్‌పై అవగాహన కల్పించారు. ముందుగానే జన్యు లోపాలను గుర్తించి వాటిపై పరిశోధనలు జరిపి పరిష్కార మార్గాలను కనిపెడతారన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిస్ ఘోరి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మా అఫ్షిన్, వైస్ ప్రిన్సిపాల్ రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారితేనే రాష్ట్రం సుభిక్షం



భిక్కనూరులో కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు



మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ వేణుగోపాల్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీటీసీలు శంకర్, జ్యోతి



శాబ్దిపూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

– కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి నేరెళ్ల శారద

భిక్కనూరు: రాష్ట్రంలో ప్రభుత్వం మారితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి నేరెళ్ల శారద అన్నారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. గ్యారంటీ పథకాలతో తొమ్మిదిన్నర ఏళ్లుగా ప్రజలు పడ్డ ఇబ్బందుల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ ఎంపీపీ బల్యాల రేఖ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, నేతలు లింబాద్రి, దయాకర్‌రెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యం

–పారిశ్రామికవేత్త వేణుగోపాల్ రెడ్డి

భిక్కనూరు: కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి ప్రజలను బానిసలుగా చూస్తున్న సీఎం కేసీఆర్‌ను ఓడించడమే తమ లక్ష్యమని ఎన్ఆర్ఐ, పారిశ్రామికవేత్త గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు మండలం కాచాపూర్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతల ఆగడాలు మితిమీరాయని, గల్లీ నుంచి పట్నం దాక ప్రజల సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారు కుటుంబంగా మారిందని ప్రజల బతుకులు మాత్రం పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఎంపీపీ గాలిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీలు

దోమకొండ: దోమకొండ–1 ఎంపీటీసీ సభ్యుడు నిమ్మ శంకర్, గొట్టిముక్కల ఎంపీటీసీ ఆసాని జ్యోతి శనివారం కాంగ్రెస్‌లో చేరారు. గత ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన శంకర్ బీఆర్ఎస్‌లో చేరారు. తిరిగి శనివారం సొంత గూటికి చేరారు. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి, రాష్ట్ర నాయకులు పాల్వాయి రజనీ కుమారి, నాయకులు ముత్యంరెడ్డి, అనంతరెడ్డి, తదితరుల సమక్షంలో వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటా ప్రచారం

కామారెడ్డి రూరల్: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని శాబ్దిపూర్, గూడెం గ్రామాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే 6 గ్యారంటీ పథకాలను ఇంటింటా వివరిస్తూ రేవంత్ రెడ్డిని గెలిపించాలని ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో నిమ్మ విజయ్ కుమార్‌రెడ్డి, గరిగె నర్సాగౌడ్, గరిగె శంకర్‌గౌడ్, తదితరులున్నారు.

కారును షెడ్డుకు పంపాల్సిన టైమొచ్చింది

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్



రామారెడ్డిలో మాట్లాడుతున్న మదన్‌మోహన్



మద్దతు తెలుపుతున్న ఆర్ఎంపీ, పీఎంపీలు



ప్రచారం చేస్తున్న మదన్‌మోహన్ సోదరి శోభ

రామారెడ్డి (ఎల్లారెడ్డి): రామారెడ్డిలో పెరిగాను.. ఆశీర్వదించండని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు ఓటర్లను కోరారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రామారెడ్డిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్మోహన్‌రావు మాట్లాడుతూ.. కారును షెడ్‌కు పంపాల్సిన సమయం ఆసన్నమైందని, అన్ని సంక్షేమ పథకాల్లో అవినీతి పేరుకుపోయిందని, రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీక్షిస్తుందని అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన మరుక్షణం నుంచి ఒక రూపాయి జీతం తీసుకుంటూ పాలన ప్రతి గ్రామానికి తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. నిరుపేదలకు ఇల్లు కట్టించడంతోపాటు గ్రామాలలో వినిపిస్తున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలిచిన సురేందర్ ఎక్కడ అభివృద్ధి చేశారో చూపించాలన్నారు. జెడ్పీటీసీ మోహన్ రెడ్డి, పోసానిపేట సర్పంచ్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

రాజంపేట: రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాలలోని ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీని వీడి మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఆర్గొండ గ్రామ సర్పంచ్ తమ్మన్నగారి లక్ష్మి తో పాటు వార్డు సభ్యులు, ఎల్లాపూర్ తండా గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌లు కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన ఆర్ఎంపీ, పీఎంపీలు

లింగంపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావుకు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఆర్ఎంపీ, పీఎంపీలు మద్దతు తెలిపారు. శనివారం లింగంపేట మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు తనకు మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలోకి రాగానే ఆర్ఎంపీ, పీఎంపీల యాక్ట్–2009 అమలు చేసే బాధ్యత తీసుకుంటానన్నారు.

పదేళ్లలో కేసీఆర్ కుటుంబమే బాగుపడింది

లింగంపేట(ఎల్లారెడ్డి): పదేళ్లలో కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు సోదరి శోభ అన్నారు. శనివారం ఆమె మోతె, గాంధీనగర్, బూరుగిద్ద తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. ఎల్లారెడ్డిలో మదన్‌మోహన్‌రావు గెలుపు ఖాయమైందన్నారు. చేతి గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ మూడోసారి సీఎం కావడం పక్కా..



బీఆర్ఎస్‌లో చేరుతున్న మాచారెడ్డి గ్రామస్తులు



సరంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

మాచారెడ్డి: ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణను సాధించిన కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం పక్కా అని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ జోస్యం చెప్పారు. మాచారెడ్డి మండల కేంద్రంతో పాటు పాల్వంచ మండలం భవానిపేట తండా నుంచి పలువురు గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్ చంద్రం, నాయకులు లక్ష్మారెడ్డి, గోవింద్ రెడ్డి, బూస శ్రీనివాస్ ఉన్నారు.

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

కామారెడ్డి రూరల్/రాజంపేట: కామారెడ్డి, రాజంపేట మండలాల పరిధిలో సీఎం కేసీఆర్ తరఫున బీఆర్ఎస్ నాయకులు శనివారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందడానికి సీఎం కేసీఆర్‌కే ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు.

ఆలయంలో రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి పూజలు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి శనివారం ప్రముఖ పుణ్య క్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి) కాలభైరవుడి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కాలభైరవుడి ఆలయంలో స్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, పోసానిపేట సర్పంచ్ గీరెడ్డి మహేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ముక్తకంఠంతో హింసను వ్యతిరేకించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ రాజేందర్‌రావు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నవంబర్ 25న అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలన దినం జరుపుకోవాలన్నారు. బాలికలు, మహిళల పట్ల అనేక రకాలుగా హింసలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రధానంగా గృహహింస, శారీరక , మానసిక, లైంగిక హింసలు జరుగుతున్నాయన్నారు. ముక్తకంఠంతో హింసను వ్యతిరేకించాలన్నారు. విద్యార్థినులు వేధింపులకు గురైతే షిటీమ్ 8712686094 ను, లేదా 100కు లేదా 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలన్నారు.

గాయత్రి షుగర్స్‌లో కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. శుక్రవారం నాటికి 15 వేల 318 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును క్రషింగ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

సమాచారం..

నేడు శ్రీదత్త విజయానంద సరస్వతి రాక

కామారెడ్డి అర్బన్: శ్రీగణపతి సచ్చిదానంద మైసూర్ పీఠం ఉత్తరాధిపతి శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామిజీ ఈనెల 26న ఆదివారం కామారెడ్డి గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో నిర్వహించే శ్రీచక్ర పూజ, సహస్ర మోదక గణపతి హోమం, పూర్ణాహుతిలో పాల్గొంటారని ఆశ్రమ ప్రతినిధి ఎల్.లక్ష్మణ్‌రావు తెలిపారు.

రాహుల్ గాంధీ సభను విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో నేడు జరగబోయే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ కాంగ్రెస్ బహిరంగ సభను విజయవతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు శనివారం తెలిపారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు సభ ఉంటుందని తెలిపారు.